www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 29 | సెప్టెంబర్ | 2026 పేజీలు : 8

## భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం




యువత సామాజిక మార్పు కోసం ఉద్యమించాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా

2లో..

# స్వేచ్ఛ, వాణిజ్యంతో రైతు, కూలీలకు ప్రమాదం








-మోడీవి వ్యవసాయ వ్యతిరేక విధానాలు
-సాగు పరిరక్షణే ధ్యేయంగా ఉద్యమాలు
-ఏఐకెఎంఎస్ జాతీయ మహాసభల్లో అశిష్ మిట్టల్

**ప్రజాపక్షం/ఖమ్మం :** స్వేచ్ఛ, వాణిజ్యం పేరుతో దేశంలోని రైతులు, కూలీలకు ప్రమాదం పొంచి ఉందని స్వేచ్ఛ, వాణిజ్యం ఈ దేశానికి అత్యంత ప్రమాదకరమని అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డా॥ అశిష్ మిట్టల్ తెలిపారు. చారిత్రాత్మక రైతాంగ ఉద్యమాలతో నల్ల చట్టాల విషయంలో వెనక్కి తగ్గిన మోడీ స్వేచ్ఛ, వాణిజ్యం పేరుతో మరో రూపంలో సాగు రంగానికి ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్నారని ఆయన తెలిపారు. అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ జాతీయ మహాసభలను పురస్కరించుకుని సోమవారం ఖమ్మంలో భారీ రైతాంగ ప్రదర్శనను నిర్వహించారు. పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాల మైదానం వరకు సాగింది. ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్ కళాశాల వద్ద వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో అశిష్ మిట్టల్ మాట్లాడుతూ కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని అప్పగించడం ద్వారా మోడీ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయాలనే కుట్రలో ఉన్నా

మిగతా 2లో..

## జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే..




ఖమ్మంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహా ధర్నా
-దిష్టిబొమ్మ దగ్ధం

3లో

## దేశంలో సమస్యల తీరు మారింది..?

-జన్ జీ ఆందోళనల నుంచి ప్రజా ఉద్యమం
-ఐక్యత, ఐక్యకార్యాచరణ దిశగా అడుగులు
-కమ్యూనిస్టు సిద్ధాంతమే బలమైనది
-నక్సలిజం అంతం కాలేదు
-మీట్ ద ప్రెస్ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జాతీయ నేత ప్రసాద్

8లో




## ఆసుపత్రిలో కనీస వసతులు నిల్..!



-ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులు
-రోగులకు కుర్చీల్లోనే గ్లూకోజ్‌లు
-ఇది వైరా వైద్య విధాన పరిషత్ ఏరియా ఆసుపత్రి దుస్థితి
-పట్టించుకోని జిల్లా వైద్యశాఖ అధికారులు




**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవల నిర్వహణపై పలు విమర్శలు, ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు కనీస సౌకర్యాలు అందడం లేదని, రోగుల సంఖ్యకు అనుగుణంగా బెడ్లు లేకపోవడంతో ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు రోగులను ఉంచి వైద్యం అందిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

**వరండా కుర్చీలోనే గ్లూకోజ్‌లు...**

ఆసుపత్రిలో రోగులకు గ్లూకోజ్ ఎక్కించేందుకు సరైన ఏర్పాట్లు లేక బయట వరండాలోనే కూర్చోబెట్టి గ్లూకోజ్ బాటిళ్లు ఎక్కిస్తున్న పరిస్థితులు ఉన్నాయని, ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులను ఉంచి గ్లూకోజ్‌లు ఎక్కించాల్సి వస్తున్న పరిస్థితులు

మిగతా 2లో..

# స్వేచ్ఛ, వాణిజ్యంతో రైతు, కూలీలకు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

రని ఆ కుట్రను ఐక్య రైతాంగ ఉద్యమాల ద్వారా ఎదుర్కొవాలని పిలుపునిచ్చారు. ఉత్తర భారతదేశం మాదిరిగా దక్షిణ భారతదేశంలో కూడా బలమైన రైతాంగ ఉద్యమాలు నిర్మితం కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ల్యాండ్ మాఫియాకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉంటుందని ఆయన అన్నారు. మోడీ రైతులపై కార్చేసి ముసలి కన్నీరు మాత్రమేనని రైతులకు ఎక్కువ ధరకు కరెంటు ఇస్తూ కార్పొరేట్లు, పారిశ్రామిక వేత్తలకు తక్కువ ధరకు విద్యుత్‌ను అందిస్తున్నారని మిట్టల్ ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలు మోడల్ పేరుతో వ్యవసాయ రంగాన్ని కబళించేందుకు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. నల్ల చట్టాలను ఎదుర్కొన్న విధంగానే స్వేచ్ఛ, వాణిజ్యం కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడతామని మిట్టల్ స్పష్టం చేశారు. మోడీ విధానాలు దేశ ఆర్థిక అస్థిరతకు దోహదం చేస్తాయన్నారు. గిరిజనుల, ఆదివాసీల, రైతుల భూ సమస్యలు, గిట్టుబాటు ధరలపై చర్చించాలని ఆయన కోరారు. ఏఐకెఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షులు, పంజాబ్ రాష్ట్రానికి చెందిన నిర్భయ్ సింగ్ మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమ



తులు భారతదేశంలో రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఈ సభలో ఏఐకెఎంఎస్ నాయకులు బాలచంద్ర షడంగి, కేదార్ సబాల్, స్టాలిన్ బాబు, సెల్వరాజ్, రాబీన్‌జ, ఐఎఫ్‌టియు నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, గౌని ఐలయ్య, మామిడాల భిక్షపతి, గాదె ఝాన్సీ, ఎంఎఫ్ గోపీనాథ్, వేణు తదితరులు ప్రసంగించారు.

# భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అమరవీరుడు భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతి వేడుకలు సోమవారం పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేష గిరిభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన భగత్ సింగ్ త్యాగనిరతి, దేశభక్తి యావత్ భారతదేశానికి నిరంతరం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కేవలం పరాయి పాలకుల నుంచి విముక్తి మాత్రమే కాకుండా, మనుషులపై మనుషులు సాగించే దోపిడీ లేని నవ సమాజ నిర్మాణం కోసం ఆయన కలలు కన్నారని గుర్తుచేశారు. నేటి పాలకులు ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తూ, దేశ సంపదను కొద్దిమంది కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం, అసమానతలు పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో యువత భగత్ సింగ్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకొని సామాజిక మార్పు కోసం ఉద్యమించాలని కోరారు. కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణకు కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ ముందంజలో ఉంటారని స్పష్టం చేశారు. మతోన్మాదం, విభజన రాజకీయాలపై రాజీలేని పోరాటం చేయడమే భగత్ సింగ్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కొరిమి రాజ్‌కుమార్, సలిగంటి శ్రీనివాస్, మేయర్ మూడ్ గణేష్, కంచర్ల జమలయ్య, జి.వీరస్వామి, ఎస్‌కె. ఫహీం, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి, నేరెళ్ల రమేష్, మండల రాజు, లక్ష్మీ నారాయణ, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో కనీస వసతులు నిల్..!

(మొదటిపేజీ తరువాయి)



కనిపిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోగుల భద్రత, వైద్యసేవల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**జిల్లా వైద్యశాఖ పర్యవేక్షణ ఎక్కడ..?**

వైద్య విధాన పరిషత్ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణపై సమర్థవంతమైన పర్యవేక్షణ ఉందా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది సిబ్బంది విధి సమయంలో సెల్‌ఫోన్‌లకే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు, సిబ్బంది ఎప్పుడు విధులకు వస్తున్నారు...ఎప్పుడు వెళుతున్నారు అన్నది కూడా స్పష్టంగా తెలియని పరిస్థితి ఉందని కొందరు రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు.

**రాత్రివేళ వైద్యసేవల పరిస్థితి ఏమిటి..?**

రాత్రి సమయాల్లో ఫార్మసిస్ట్‌లు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయా? మందుల లభ్యత, సిబ్బంది అందుబాటు ఎలా ఉంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**రాత్రిపూట ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారు..**

వైరాలోని వైద్య విధాన పరిషత్ ఏరియా ఆసుపత్రిలో రాత్రిపూట ఎంతమంది విధులు నిర్వహించాల్సి ఉంటే ఎంతమంది నిర్వహిస్తున్నారనేది ప్రశ్న ఇప్పుడు చర్చగా మారింది. రాత్రిపూట ఇద్దరు ముగ్గురే ఉంటున్నారని ప్రచారం జరుగుతూ ఉంది. వాస్తవంగా రాత్రిపూట ఎంతమంది సిబ్బంది వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో పనిచేయాల్సి ఉంటుంది అనేది కూడా స్పష్టతగా అధికారులు గమనించాల్సిన అవసరం ఉంటుంది.

**జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించాలి..**

వైరా వైద్య విధాన పరిషత్ ఏరియా ఆసుపత్రిపై వస్తున్న ఆర్పోణలపై జిల్లా వైద్యశాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వైద్యులు, సిబ్బంది, హాజరు విధుల నిర్వహణ , రోగులకు అందుతున్న సేవలు, బెడ్ల లభ్యత, రాత్రివేళ సిబ్బంది అందుబాటు వంటి అంశాలను పరిశీలించాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. వైరా వైద్య విధాన పరిషత్ ఏరియా ఆసుపత్రిలో వాస్తవంగా ఏం జరుగుతుంది? వైద్యుల పర్యవేక్షణ ఎంతవరకు ఉంది? రోగులకు అందుతున్న సేవలను జిల్లా వైద్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారా? అనే ప్రశ్నలకు అధికారుల సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

# అధ్యాపకుడికి సన్మానం

**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో జపాన్ ఎడ్యుకేషన్ ఎక్స్‌పోజర్‌కు వెళ్లి వచ్చిన కారేపల్లి ప్రభుత్వ జూనియన్ కళాశాల అధ్యాపకుడు దుర్గాప్రసాద్‌ను కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపల్ విజయకుమారి అధ్యక్షతన నిర్వహించిన అభినందనల సభలో బోధన, బోధనేతర సిబ్బంది ఆయనను సత్కరించారు. ఈసందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జపాన్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్య, ఉపాధి, శిక్షణ, మౌలిక వసతులు వివరించారు. ప్రిన్సిపల్ విజయకుమారి మాట్లాడుతూ దుర్గాప్రసాద్ చేస్తున్న వినూత్న ప్రయోగాలు, శ్రమను గుర్తించిన ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆయనను జపాన్ ఎక్స్‌పోజర్‌కు ఎంపిక చేసిందన్నారు. దీనితో బాధ్యత మరింత పెరిగిందని పేర్కొంటూ అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ప్రధానాచార్యులు కేఎస్ రామారావు, వాసిరెడ్డి శ్రీనివాస్, ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సింహాచలం, కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు పదోన్నతి

**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కోర్సా వెంకటేశ్వర్లు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. సోమవారం జిల్లా ఎస్‌పీ రోహిత్ రాజు చేతుల మీదుగా పదోన్నతి ప్రక్రియ పూర్తయింది. పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లును సీఐ ఎల్లయ్య, ఎస్ఐ రాజేష్, ఏఎస్ఐలు రామచంద్రారెడ్డి, సూర్యారావు, పోలీసు సిబ్బంది అభినందించారు.



# పేపర్ మడత పడుతోందా..!

- -చేతిలో పత్రిక స్థానంలో స్మార్ట్‌ఫోన్
- -డిజిటల్ వార్తల వైపు కొత్త తరం పరుగులు
- -ప్రింట్ మీడియాకు మార్పు తప్పదా....?

**ప్రజాపక్షం/ తల్లాడ :** ఒకప్పుడు ఉదయం నిద్ర లేవగానే చేతిలో పేపర్ ఉండాలి. ఇంటి ముందు పత్రి క పడిందంటే ఆ రోజుకు వార్తా ప్రపంచం మన గడప తట్టినట్టే. టీ కప్పుతో పత్రిక చదవడం, ముఖ్యమైన వార్తలను గుర్తుపెట్టుకోవడం, సంపాదకీయాలు చదవడం, ఉద్యోగ ప్రకటనలు చూడటం, స్థానిక వార్తల కోసం పేజీలు తిరగేయడం, ఇవన్నీ ఒకప్పుడు ప్రతి కుటుంబంలో కనిపించే సాధారణ దృశ్యాలు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. చేతిలో పేపర్ స్థానంలో స్మార్ట్‌ఫోన్ వచ్చింది. ఉదయం పత్రిక కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా నిద్రలేచిన వెంటనే మొబైల్‌లోనే తాజా వార్తలు అందుతున్నాయి. వార్తా యాప్‌లు, వెబ్‌సైట్లు, వాట్సాప్, యూట్యూబ్, సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్‌లు వార్తలను ప్రజల చేతుల్లోకి నేరుగా తీసుకు వస్తున్నాయి.

**డిజిటల్ వార్తలకు పెరుగుతున్న ఆదరణ :**

భారతదేశంలో వార్తల వినియోగంలో డిజిటల్ మాధ్యమాల పాత్ర గణనీయంగా పెరిగింది. Reuters Institute 2026 నివేదికలో భారత సర్వేలో పాల్గొన్న వారిలో సగానికి పైగా సోషల్ మీడియా ద్వారా వార్తలను ఉపయోగిస్తున్నట్లు నమోదైంది. యూట్యూబ్‌ను వార్తల కోసం ఉపయోగిస్తున్నట్లు చెప్పిన వారి శాతం సుమారుగా 58గా ఉంది. అయితే ఈ సర్వే ప్రధానంగా ఆన్‌లైన్‌లో ఉన్న ఎక్కువగా ఇంగ్లీష్ మాట్లాడే వినియోగదారులపై ఆధారపడినందున దీన్ని మొత్తం భారత జనాభాకు నేరుగా వర్తింపజేయకూడదు. అంటే పత్రిక పూర్తిగా అంతరించిపోతుందని కాదు పత్రిక తన రూపాన్ని మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

**పత్రిక సర్క్యులేషన్ తగ్గుతుందా...?**

ప్రపంచ వ్యాప్తంగా ప్రింట్ వార్తాపత్రికల వారపు వినియోగంలో గత దశాబ్దంలో గణనీయమైన తగ్గుదల నమోదైందని Reuters Institute 2026 అధ్యయనం చెబుతుంది. అయితే భారతదేశంలో ప్రింట్ పత్రికల పరిస్థితిని అంచనా వేయడానికి ప్రాంతీయ భాష, వయస్సు, పట్టణ, గ్రామీణ తేడాలు వంటి అంశాలను






కూడా పరిగణలోకి తీసుకోవాలి. ప్రత్యేకంగా తెలుగు, హిందీ వంటి ప్రాంతీయ భాషా పత్రికలకు స్థానిక వార్తలు, మండల, జిల్లా స్థాయి సమస్యలు, వ్యవసాయం, ఉద్యోగాలు, విద్య, రాజకీయాలు, ప్రకటనలు వంటి అంశాల వల్ల ప్రత్యేక స్థానం ఉంది. యువతలో వార్తలను మొబైల్‌లో చదివే అలవాటు పెరగడం స్పష్టంగా కనిపిస్తుంది. ఒక వార్తను చదవడానికి పేపర్ కోసం మరుసటి రోజు వరకు వేచి ఉండాల్సిన అవసరం లేదు. సంఘటన జరిగిన నిమిషాల్లోనే మొబైల్‌లో నోటిఫికేషన్ వస్తుంది. అయితే వేగంతో పాటు సమస్యలు కూడా ఉన్నాయి. సోషల్ మీడియాలో ధృవీకరించిన సమాచారం. పాత వార్తలను కొత్తవిగా ప్రచారం చేయడం, తప్పుదారి పట్టించే వీడియోలు, కృత్రిమ మేధస్సుతో రూపొందించిన కంటెంట్ వంటి సవాళ్లు పెరుగుతున్నాయి. భారతదేశంలో తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారంపై కూడా వినియోగదారుల్లో ఆందోళన ఉన్నట్లు Reuters Institute నివేదికలు సూచిస్తున్నాయి.

**పత్రికా ధర్మం ఎక్కడ ...?**

డిజిటల్ యుగంలో పత్రికా ధర్మం అవసరం అవుతుంది. వార్తను ముందుగా ఇవ్వడం మాత్రమే జర్నలిజం కాదు. నిజనిజాలను నిర్ధారించడం, రెండు వైపుల వాదనలను తెలుసుకోవడం, బాధితుల గొంతును వినిపించడం, అధికారులను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు రావడం, తప్పు జరిగితే సరిదిద్దడం కూడా పత్రికా ధర్మంలో భాగమే. సోషల్ మీడియాలో ఒక సమాచారం నిమిషాల్లో వైరల్ కావచ్చు. కానీ పత్రిక ఒక వార్తను ప్రచురించే ముందు దాని వెనుక ఉన్న వాస్తవాలను పరిశీలించాల్సిన బాధ్యత మరింత పెరుగుతుంది. నమ్మదగిన జర్నలిజం ఏ రూపంలో కొనసాగుతుంది అనేదే ముఖ్యంగా మారవచ్చు. ఒకే పత్రిక ఉదయం ప్రింట్ ఎడిషన్‌తో పాటు వెబ్‌సైట్ యాప్, వాట్సాప్, యూట్యూబ్ , సోషల్ మీడియా ద్వారా కూడా పాఠకుడిని చేరుకోవచ్చు. అంటే ప్రింట్, డిజిటల్ మధ్య పోటీ కంటే రెండింటి కలయిక భవిష్యత్తులో మరింత ముఖ్యమయ్యే అవకాశం ఉంది.

**పాఠకుడి చేతిలోనే భవిష్యత్తు :**

పేపర్ చదివే అలవాటు తగ్గిందా...? కొన్ని వర్గాల్లో తగ్గుతుంది. డిజిటల్ వార్తలకు ప్రాధాన్యం పెరిగిందా...? అవును ముఖ్యంగా యువత, ఆన్‌లైన్ వినియోగదారుల్లో పెరుగుతుంది. పత్రికలు పూర్తిగా కనుమరుగవుతున్నాయా ఇప్పుడే అలా చెప్పడానికి ఆధారాలు లేవు. అయితే పత్రికలు మారాల్సిన అవసరం మాత్రం స్పష్టంగా ఉంది. వేగం కోసం డిజిటల్ అవసరం. లోతైన విశ్లేషణకు పత్రిక అవసరం. స్థానిక సమస్యలకు ప్రాంతీయ మీడియా అవసరం. ప్రజాస్వామ్యానికి బాధ్యతాయుతమైన జర్నలిజం అవసరం. పత్రిక రూపం మారవచ్చు, చదివే పద్ధతి మారవచ్చు, కానీ ప్రజల తరుపున ప్రశ్నించే వాస్తవాలను వెలుగులోకి తెచ్చే అధికారాన్ని జవాబుదారీగా నిలిపే పత్రికా ధర్మం మాత్రం కొనసాగాల్సిందే.

# జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే..




## ఖమ్మంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహా ధర్నా -దిష్టిబొమ్మ దగ్ధం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఓటు చోరీ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ సోమవారం కలెక్టరేట్ వద్ద మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా, సమగ్ర సవరణ పేరుతో అర్హులైన అనేక మంది ఓట్లను తొలగిస్తున్నారని దీనిపై పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణ పట్ల ఎన్నికల కమిషన్‌పై ప్రజలు విశ్వాసం కోల్పోయారన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేసేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలన్నారు. అమిత్‌షా, మోడీ మద్దతుతో జ్ఞానేష్ కుమార్ ఎన్నికల ఫలితాలను తారుమారు చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఓటర్ల సమగ్ర సవరణలో లోపాలు తదితర విషయాలపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ శాసన మండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ మాజీ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, బేబి స్వర్ణకుమారి, కట్ల రంగారావు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, మొక్కా శేఖర్ గౌడ్ తో పాటు నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, వెంకటేశ్వరరావు, సీతారాములు, పలువురు మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అక్టోబర్ రెండున టియుడబ్ల్యూజె (ఐజెయు) ఆందోళన

ప్రజాపక్షం/ఖమ్మం : జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, సంక్షేమ పథకాల సాధన కోసం గాంధీ జయంతి రోజున జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట శాంతియుత ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు లు తెలిపారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పట్ల ప్రభుత్వం నాన్చివేత ధోరణిని అవలంభిస్తుందని మండల, జిల్లా కేంద్రాల్లో ఇండ్ల స్థలాల కేటాయింపు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టినట్లు వారు తెలిపారు. న్యాయస్థానాల పేరుతో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డును ఇవ్వాలని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) డిమాండ్ చేస్తుందని వారు తెలిపారు. రోజు రోజుకు జర్నలిస్టుల హక్కులు హరించబడుతున్నాయని వారు ఆరోపించారు. జర్నలిస్టుల సంక్షేమం మండల కేంద్రాలు సహా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇండ్ల స్థలాల పంపిణీ, హెల్త్ కార్డులు ఇతర జర్నలిస్టుల సమస్యలపై జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని వెంకటేశ్వరరావు, పాపారావు లు విజ్ఞప్తి చేశారు.

## చిన్నమండవ గ్రామాభివృద్ధికి సహకరించండి



ప్రజాపక్షం/చింతకాని : చిన్నమండవ గ్రామాభివృద్ధికి నిధులు మంజూరీ చేయాలని గ్రామ సర్పంచ్ పర్చా రామచంద్రరావు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆదివారం చింతకాని మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు వచ్చిన భట్టి విక్రమార్కను నాగులవంచలో కలిసి గ్రామ సమస్యలను వివరించారు. పెద్ద చెరువు అలుగువాగు వరకు బీటీ రోడ్డు, పల్లె దవాఖానా కు ప్రహరీ గోడ, ఎస్సీ కాలనీలో సైడ్ డ్రైనేజి పనులకు నిధులు మంజూరీ చేయాలని కోరగా త్వరలోనే మంజూరీ చేస్తానని భట్టీ హామీ ఇచ్చారు. చిన్న మండవ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భట్టీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, బెజవాడ రవి తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## -ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు పి. శ్రీనివాసరెడ్డి, పి. శ్రీజలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సింగరేణి మండలం పేరుపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు బి. రమేష్ గ్రామంలో ఆరులక్షల అక్రమ బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతులు తమ గ్రామంలో అధికంగా పెసర పంట సాగు చేశామని మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసర కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని దరఖాస్తు చేశారు. కల్లూరు మండలం పేరువంచ గ్రామానికి చెందిన సత్యం సర్వే నెం. 92/1/2లో ఎకరం పట్టా భూమి ఆక్రమణకు గురైందని దీనిపై విచారణ చేసి తన భూమిని తనకు అప్పగించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కూసుమంచి మండలం తురకగూడెం గ్రామానికి చెందిన కొమ్ము భాగ్యలక్ష్మి తనకు పైలేరియా పెన్షన్ 2022లో మంజూరైందని ఈ మధ్య పెన్షన్ నిలిపివేశారని తన పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ప్రజాపక్షం/ముదిగొండ: మత్తు పదార్థాలు, చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు వైద్యాధికారి నాగేంద్రప్రసాద్ తగు సూచనలు అందించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం 'నషా ముక్త్ భారత్ ' కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలు వినియోగం వల్ల ఆరోగ్యంపై పడే ప్రభావాలు, వ్యక్తిగత జీవితంపై కలిగే నష్టాలు, వ్యసనాలకు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి మధుసూదన్‌రావు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమండవలో ఉచిత పశు వైద్య శిబిరం



ప్రజాపక్షం/ముదిగొండ: మండల పరిధిలోని పెద్దమండవ గ్రామంలో సోమవారం పశుసంవర్థక శాఖ గ్రామ సర్పంచి, ఉప సర్పంచులు లంకెల కోమటరెడ్డి, కుక్కల సైదులు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు రమేష్‌బాబు పశువులకు సోకే వివిధ వ్యాధులకు వైద్య చికిత్సలు అందించడంతోపాటు గర్భధారణకు సంబంధించిన చూడి పరీక్షలు నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేసి, పశువుల ఆరోగ్య పరిరక్షణ, పాల ఉత్పత్తి పెంపుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి పి.అశోక్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎం.వెంకటేశ్వర్‌రావు, ట్రైనీ వైద్యులు కనక బిందు, అఫ్రోజ్, సోహిత మనోహర్, పశు వైద్య సిబ్బంది అనిత, భారతి, ఇమ్రాన్‌ఖాన్, గోపాల మిత్రులు సైదులు, నరేష్, నరసింహా, రాంపరశు, గ్రామ పెద్దలు తాటి బాబు, కోడె బాబు, సింగు వెంకయ్య, పఠాన్ మస్తాన్‌ఖాన్, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల సాధన కోసం పోరాడండి

## -ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు మహ్మద్ సలాం




ప్రజాపక్షం/ ఖమ్మం : ముస్లిం మైనార్టీలు హక్కుల సాధన కోసం అణిచివేతకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని తన్జీమ్ ఎ ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహ్మద్ సలాం కోరారు. స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో సోమవారం ఎస్‌కె సైదా అధ్యక్షతన జరిగిన ఇన్సాఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలను ఓటు బ్యాంకు రాజకీయాలుగా చూస్తున్నాయి తప్ప సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. మైనార్టీ రిజర్వేషన్లను, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజా ప్రయోజనాల ద్వారా ఓట్లు పొందాల్సిన పాలకులు ఓటు చోరీ ద్వారా అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారన్నారు. సమావేశ అనంతరం ఇన్సాఫ్ ఆధ్వర్యంలో కేంద్ర ఎన్నికల సంఘం వైఖరిని నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. జ్ఞానేష్‌కుమార్ తక్షణం రాజీనామా చేయాలని, మోడీ, అమిత్‌షాలను వెంటనే అరెస్టు చేసి విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. జ్ఞానేష్‌కుమార్ హయాంలో జరిగిన ఎన్నికలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని, ఎన్నికలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట యాకూబ్, ఎండి మజీద్, ఎండి రెహ్మాన్, ముజామిల్ ముజ్జు, అమీర్, సైదా బేగం, నజీయా, ఎస్‌కె బేగం, కరీం, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం: మాదకద్రవ్యాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ సూచించారు. కళాశాలలో సోమవారం నషాముక్తిఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించి, ఆరోగ్యశాఖ సిబ్బంది మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, వ్యాయామంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో నషాముక్తి ప్రతిజ్ఞ చేయించి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ పోరాట చరిత్ర మరువలేనిది

## ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు శ్రావణ్‌కుమార్



ప్రజాపక్షం/సత్తుపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ పోరాట చరిత్ర మరువలేనిదని ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు శ్రావణ్‌కుమార్ అన్నారు. భగత్‌సింగ్ 119వ జయంతిని పురస్కరించుకుని అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూనూగు మీసాల వయసులోనే బ్రిటిష్ పాలకులపై పోరాటం చేసిన భగత్‌సింగ్ జీవితం, త్యాగాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ఉద్యమాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు .ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దందు ఆదినారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు నిమ్మటూరి రామకృష్ణ, రమేష్, నరేష్, హరినాథ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# చుంచుపల్లి హైస్కూల్, ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**- క్లాస్‌లో ఉపాధ్యాయుడు లేకపోవడంపై ఆగ్రహం.. హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్**



**ప్రజాపక్షం/చుంచుపల్లి:** చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక రోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యా ప్రమాణాలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, ల్యాబొరేటరీ సేవలను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించి, రికార్డుల్లో నమోదైన వివరాల ప్రకారం ఉపాధ్యాయులు తరగతి గదుల్లో అందుబాటులో ఉన్నారా లేదా స్వయంగా పరిశీలించారు. వివిధ తరగతుల విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. పదో తరగతి గదిలో ఉపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంపై ఆరా తీసిన కలెక్టర్ సరైన సమాధానం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికి షోకాజ్ నోటీస జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణత



శాతం, గత ఫలితాలు, ప్రస్తుత విద్యా ప్రగతిపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలన పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ రోజువారీ ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సుమారు 50 నుంచి 60 మంది వరకు ఓపీకి వస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలోని ఇన్‌పేషెంట్ విభాగాన్ని పరిశీలించి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మందుల స్టోర్‌ను పరిశీలించారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలను ముందుగానే ఇండెంట్ పెట్టి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది హాజరు పట్టినను పరిశీలించి ప్రతి ఒక్కరూ విధులకు సక్రమంగా హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో తహాశీల్దార్ నాగరాజు, ఎంఈఓ నీరజ, పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, నర్సులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా వినతులు సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలు సమర్పించిన విన్నపాల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణికి హాజరైన ఆయన పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో ప్రజావాణికి ప్రజలు వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తుంటారని వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై కాల వ్యవధిలో సహేతుకమైన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మ్రీణాల్ శ్రేష్ఠ, ఐటిడిఏ కార్యాలయంలో డిడి చందన్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు విధులు నిర్వహించానలి సూచించారు. గిరిజన



దర్బార్‌లో అందిన వినతులను పరిశీలించిన చందన ఆయా శాఖల అధికారులకు అందజేశారు. ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రాధాన్యత క్రమంలో అర్హులందరికీ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో విద్యార్థులు యువకులు ఉద్యమించాలి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఏఐవైఎఫ్ జూలూరుపాడు మండల సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్కె చాంద్ పాషా మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం భారతదేశ యువతకు స్ఫూర్తిదాయకమని అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలియజేసే బాధ్యత పాలకులదని భగత్ సింగ్ జయంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి



యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాల నేడు దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ దేశాన్ని దోచుకుంటున్నారని భారత దేశ స్వతంత్రం కోసం చేసిన పోరాటం ఆలోచనలు భగత్ సింగ్ చూపిన కార్యచరణ నేటి స్ఫూర్తికి ప్రతిరూపంగా విద్యార్థులు యువత ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చలగొండ్ల సతీష్, సురేష్ గోపి మోహన్ షేక్ యాకూబ్ పాషా, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి ఆదర్శం

**ప్రజాపక్షం/ఇల్లందు:** ఏఐవైఎఫ్ ఇల్లందు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో షహీద్ భగత్‌సింగ్ 119వ జయంతిని 24 సెంటర్ నంబర్ 2 బస్తీలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యుడు రామ కృష్ణ, పట్టణ కార్యదర్శి ఈర్ల రవి మాట్లాడుతూ 23ఏళ్లకే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ యువతకు పోరాట స్ఫూర్తి అని అన్నారరు. చదువుతో పాటు సామాజిక మార్పు కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగం, మత విద్వేషాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువత చైతన్యంతో ముందుకు రావాలని కోరారు. సింగరేణి ఉద్యోగాలు, ఇల్లందు యువత ఉపాధి, డ్రగ్స్, మత్తు పదార్థాల నివారణ కోసం ఏఐవైఫ్ పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. అనంతరం భగత్‌సింగ్ అమర్ రహే...ఇంక్విలాల్ జిందాబాద్ నినాదాలు





చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు బాస శ్రీనివాస్, బొప్పిశెట్టి సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్, ఉప సర్పంచ్ షేక్ ఖాసీం, ఉడుగ ఐలయ్య, సాయిరి రాజేశ్వరరావు, దాట్ల శ్రీకాంత్, శరత్, సంతోష్‌కుమార్, కిరణ్, సుమన్, రాంబాబు, యాదయగిరి, ప్రసాద్, చాట్ల గణపతి, జయ, తదితర ఏరియా నాయకులు, యువజన సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఏఐసీసీ, పీసీసీ ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో చిన్న చిన్న తప్పుల పేరుతో అర్హులైన ఓట్లను తొలగిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కూడా డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఊసా అనిల్ కుమార్, సర్పంచులు మచ్చా నరసింహారావు, కుంజా జాను, ఇర్పా కవిత, జిమ్మా ఝాన్సీ, ఉప సర్పంచ్ హర్షా నాయక్, ఆవుల రవి, బేతం రామకృష్ణ, బచ్చు వెంకట రమణ, చెంచల రాము, వల్లపు వెంకన్న, వేముల విజయ్, పద్దం నరసింహారావు, గొడ్ల నాగేశ్వరరావుతో పాటు వార్డు సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

# యువతకు ఆదర్శం భగత్‌సింగ్



**ప్రజాపక్షం/కారేపల్లి:** డీవైఎఫ్ఐ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో షహీద్ భగత్‌సింగ్ 119వ జయంతిని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదేర్ల వినయ్‌కుమార్ మాట్లాడుతూ భగత్‌సింగ్ నేటితరత యువతకు స్ఫూర్తిదాయక ఆదర్శమన్నారు. విద్య, వైద్యం, నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం చూపడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. విద్య, వైద్యం ఖరీదైపోయాయని, యువతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందడం లేదని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగాన్ని అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో చిలుముల భరత్, గడ్డం దిలీప్, గాదె నరేష్, తాళ్లూరి రాజా, కిన్నెర కిరణ్, వాడపల్లి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి వైద్య భరోసా



**ప్రజాపక్షం/కారేపల్లి:** స్ట్రోక్‌కు గురై వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమతలేని కారేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ప్రేమ్‌కు మిషన్ వాక్ ఫౌండేషన్ అండగా నిలిచింది. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మిషన్ వాక్ సభ్యుడు, కారేపల్లి ఇరానీ టీ స్టాల్ నిర్వాహకుడు గుగులోత్ నరేష్ చొరవతో విషయం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాదావత్ రవి(పీటీ)దృష్టికి వెళ్లింది. ప్రేమ్ ఆరోగ్య పరిస్థితి, కుటుంబ ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న డాక్టర్ రవి సూచనతో హైదరాబాద్‌లో ఉచిత స్ట్రోక్ థెరఫీ ప్రారంభించారు. ప్రేమ్ పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన చికిత్స ఖర్చును మిషన్ వాక్ ఫౌండేషన్ భరిస్తుందని కుటుంబానికి భరోసా ఇచ్చారు. ప్రేమ్ అనారోగ్యంతో కుటుంబ ఆదాయం తగ్గిపోవడంతో భార్య సుజాత పెట్రోల్ బంక్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. కుమారుడు జీవన్‌కి ఏడు సంవత్సరాలు, కుమార్తె నక్షత్రకి మూడు సంవత్సరాలు ఉన్నారు. భర్త వైద్యం, పిల్లల పోషణ బాధ్యతలు భారంగా మారిన వేళ ఫౌండేషన్ సహాయం తనకు ఎంతో ఊరటనిచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ సమస్యలను డాక్టర్ రవి దృష్టికి తీసుకెళ్లిన గుగులోత్ నరేష్, చికిత్సకు భరోసా కల్పించిన డాక్టర్ బాదావత్ రవి, మిషన్ వాక్ ఫౌండేషన్‌కు ప్రేమ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అశ్వాపురంపాడులో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం



**ప్రజాపక్షం/కరకగూడెం:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మణుగూరు డిఎస్పి వి. రవీందర్ రెడ్డి సారధ్యంలో మండల పరిధిలోని అశ్వాపురం పాడు గ్రామంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి గ్రామస్తులు ఉద్దేశించి అశ్వాపురం పాడు గ్రామంలో గత సంవత్సర కాలంగా జరుగుతున్న వరుస సంఘటనలను ప్రస్తావించి గ్రామస్తులు అందరూ కూడా చట్టాన్ని గౌరవించి చట్టానికి లోబడి జీవించాలని ఎవరు కూడా అసాంఘిక కార్యకలాపాలకు చట్టాన్ని అతిక్రమించే చర్యలు కు పాల్పడవద్దని తెలిపారు. ఎవరైనా అలా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే పోలీస్ చట్ట ప్రకారం చర్యలు తీసుకొని వారిని చట్టం ముందు దోషిగా నిలబెడతారని అందరూ కూడా మంచి వ్యక్తిత్వం నడవడికతో ఉండాలని తెలిపారు. అనంతరం ఊర్లోని చిన్నపిల్లలకు సుమారుగా 50 మందికి దుస్తుల్ని అందజేశారు. ఎవరైనా చట్టానికి వ్యతిరేకంగా వివరించినట్లయితే వారి పట్ల కఠినంగా వ్యహరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడూళ్ళ బయ్యారం సిఐ ఈ వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్ఐ పి వి ఎన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# మూతపడిన వాటర్ ప్లాంట్

## తాగునీటి కోసం తల్లడిల్లుతున్న సుజాతనగర్ ప్రజలు



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గతంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ప్రస్తుతం మరమ్మతుల కారణంగా మూతపడింది. దీంతో సుజాతనగర్ డివిజన్ పరిధిలోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ ప్లాంట్ ద్వారా స్థానికులకు మంచినీరు అందుబాటులో ఉండేది. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రస్తుతం ప్లాంట్ పనిచేయకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు ఇతర మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోంది. మంచినీరు ప్రజల ప్రాథమిక అవసరమని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్లాంట్ మరమ్మతులు పూర్తి చేసి సుజాతనగర్ ప్రజలకు తిరిగి మంచినీటి సదుపాయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం

**-అక్టోబర్ ఒకటి నుంచి మీడియేషన్ ఫర్ ది నేషన్**
**-ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ నాగరాజు**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వివాదం కంటే పరిష్కారం ముఖ్యం అనే సదాశయంతో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా అక్టోబర్ ఒకటి నుంచి డిసెంబర్ 31 వరకు మీడియేషన్ ఫర్ ది నేషన్ 3.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎం. నాగరాజు సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా ఖమ్మంజిల్లాలో మధ్యవర్తిత్వానికి అనుకూలమైన కేసులను ప్రత్యేకంగా గుర్తించి ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో సామరస్య పూర్వకంగా పరిష్కరించేందుకు విస్తృత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మధ్యవర్తిత్వానికి తగిన కేసులను ఎంపిక చేయడమే కాకుండా కక్షిదారులకు మధ్యవర్తిత్వ ప్రక్రియ దాని ద్వారా కలిగే ప్రయోజనాలపై పూర్తి అవగాహన కల్పించ నున్నారు. ఈ ప్రక్రియలో ప్రత్యేక శిక్షణ పొందిన మధ్యవర్తులు ఇరుపక్షాల వాదనలను, సమస్యలను స్వతంత్రంగా విని పరిష్కార మార్గాలను సూచిస్తారని ఇందులో ఎలాంటి పరిష్కారాన్ని బలవంతంగా రుద్దే అవకాశం ఉండదన్నారు. తుది పరిష్కారం పూర్తిగా ఇరు పక్షాల స్వచ్ఛంద సమ్మతిపైనే ఆధారపడి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల ఏళ్ల తరబడి సాగే విచారణ వల్ల జరిగే సమయం, డబ్బు ఆదా అవ్వడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. ముఖ్యంగా కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు. మోటారు వాహన ప్రమాదాల కేసులు, భూ తగాదాలు, రాజీపడతగిన క్రిమినల్ కేసుల్లో సంబంధాలు దెబ్బకుండా సయోధ్య కుదిరే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో గరిష్ట సంఖ్యలో కేసులను సామరస్యంగా పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అన్ని ప్రయత్నాలను చేస్తుందన్నారు. మీడియేషన్ ఫర్ ది నేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో న్యాయవాదులు, మధ్యవర్తులు, న్యాయస్థాన సిబ్బంది, సంబంధి శాఖల అధికారులు, ప్రజలు పూర్తి సహకారం అందించాలన్నారు. ఇట్టి అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# భగత్‌సింగ్ కలల భారతం కోసం యువత పోరాడాలి

**- ఓటు హక్కు పరిరక్షణే నేటి యువత బాధ్యత : ఏఐవైఎఫ్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భగత్‌సింగ్ ఆశయాల స్ఫూర్తితో సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయంతో కూడిన సమాజ నిర్మాణానికి నేటి యువత, విద్యార్థులు కృషి చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. ఫహీమ్ దాదా పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫహీమ్ దాదా మాట్లాడుతూ భగత్‌సింగ్ కోరుకున్న స్వాతంత్ర్యం కేవలం బ్రిటిష్ పాలన నుంచి అధికార బదిలీ కాదని, దోపిడీ, అసమానతలకు ముగింపు పలికి ప్రజాస్వామ్య, సామాజిక న్యాయంతో కూడిన సమాజాన్ని నిర్మించడమేనని అన్నారు. నేడు ప్రజాస్వామ్య హక్కుల్లో ఓటుహక్కు అత్యంత కీలకమని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఒక్క అర్హుడి ఓటు కూడా అన్యాయంగా తొలగిపోకుండా పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో నమోదైన తప్పిదాలు, నోటీసుల జారీ, ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ఎన్నికల సంఘం బాధ్యతారాహిత్యంగా లేదా చట్టవిరుద్ధంగా వ్యవహరించినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేవారు. ఎన్నికల కమీషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, తప్పిదాలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖయ్యూమ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేందర్, ఉపాధ్యాకులు భూపేష్, జావీద్, కొయ్యడ రవి, బాబా, రామకృష్ణ, శివ, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ సేరాల పట్ల సీనియర్ సిటిజన్స్ అప్రమత్తంగా ఉండాలి




**ప్రజాపక్షం/చుంచుపల్లి:** సైబర్ నేరాల పట్ల సీనియర్ సిటిజన్స్ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఎస్ఐ ఎస్‌కె.జుబేదా బేగం అన్నారు. సీనియర్ సిటిజన్స్ డే వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యానగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాల్‌లో అధ్యక్షులు కొల్లు నాగేశ్వర రావు అధ్యక్షతన సీనియర్ సిటిజన్స్‌కు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ వరప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేవారు. అసోసియేషన్ కార్యదర్శి సురేష్ కుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జుబేదా బేగం మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు అమలయకులను మోసం చేసేందుకు రోజుకో కొత్త పద్ధతిని అవలంబిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్‌కు వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్ లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులకు OTP, PIN, CVV, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో భయపడకుండా వెంటనే సంబంధిత బ్యాంకును సంప్రదించాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాజేంద్రప్రసాద్, కే.గురుమూర్తి, పాండు రంగారావు, అంజనానందం, జోసెఫ్, ప్రవీణ్ కుమార్, కేశవరావు, ప్రేమసాగర్, సామ్యూల్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు బాబూ ప్రసాద్, డాక్టర్ బత్తుల కృష్ణయ్య, వివిధ సంఘాల ప్రతినిధులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీలో వైద్య శిబిరం




**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం ఎస్సీ కాలనీలో జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోందని గతవారం బీఆర్ఎస్ యువజన అధ్యక్షులు గద్దల రామకృష్ణ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆయన విన్నపం మేరకు సోమవారం అశ్వాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రామలక్ష్మి ఆధ్వర్యంలో కాలనీలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. తన విన్నపానికి స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వైద్యాధికారులు, సిబ్బందికి గద్దల రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

## గిరిజన ప్రాంత రహదారిపై నిర్లక్ష్యం వీడాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భద్రాద్రి జిల్లా జూలూరుపాడు, ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలాల గిరిజన ప్రాంత రహదారిపై నిర్లక్ష్యం వీడి, జూలూరుపాడు అర్అండ్బీ క్రాస్ రోడ్ నుండి నాచారం వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు ఒంటిగుడిసె, నాచారం మీదుగా పోవు రహదారి పూర్తిగా ధ్వసం మై ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకుపోవడం దారుణమని ఏన్కూరు మాజీ ఎంపీపీ అరేం వరలక్ష్మి ఓ ప్రకటనలో తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల పట్ల వివక్షత వద్దు ఇది గిరిజన ప్రాంతం కావడం వల్ల పాలకులు, అధికారులు ఈ రోడ్డు పై పట్టింపు లేకుండా వ్యవరిస్తూ ఈ రోడ్డు మరమ్మత్తులకు వచ్చిన నిధులను వేరే ప్రాంతాలకు మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద లోతైనా గుంటల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, అత్యవసర సమయాల్లో గర్భిణీ లను, రోగులను అస్పత్రికి తీసుకెళ్లాడానికి అంబులెన్సు కూడా రాలేని పరస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసిద్ధ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలకు ఈ ఇరుకైనా రోడ్డు వల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కేవలం తాత్కాలికంగా గుంటలు పుడ్చడం కాకుండా, శాశ్వత రోడ్డు నిర్మాణం చేయాలని ఆరేం వర్షలక్ష్మి డిమాండ్ చేశారు.

## భగత్‌సింగ్ ఆశయాలను విస్తృతంగా ప్రచారం చేయాలి




**ప్రజాపక్షం/భద్రాచలం :** విప్లవ వీరుడు భగత్ సింగ్ ఆశయాలను యువతలో విస్తృతంగా ప్రచారం చేయాలని ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంయుక్త కార్యదర్శి సాధనపల్లి సతీష్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా భద్రాచలం సిపిఐ కార్యాలయంలో సిపిఐ సీనియర్ నాయకులు మారెడ్డి శివాజీ, నాయుడు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరదాడి, సమసమాజ స్థాపనను లక్ష్యంగా చేసుకున్న భగత్‌సింగ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన నినదించిన 'ఇంక్విలాబ్ జిందాబాద్' నేటికీ ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తోందన్నారు. భగత్‌సింగ్ ఆశయాలపై సభలు, సమావేశాలు, సదస్సులతోపాటు రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, వ్యాసరచన పోటీలు వంటి సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు శోభన్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కొక్కిరేణి అశోక్‌కుమార్, పట్టణ నాయకులు కొండా కౌశిక్, పసుపులేటి సాయి, ఎస్‌కే. కాసిం తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రపంచ ప్రజా పోరాటాలకు మద్దతివ్వాలి

**ప్రజాపక్షం/ఇల్లందు:** భగత్‌సింగ్ 119వ జయంతి సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున ఇల్లందులో కాగడాలతో ప్రభాతబేరి, మేల్కొలుపు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రారంభమైన ర్యాలీ జగదాంబ సెంటర్, పాత బస్టాండ్, బుగ్గవాగు సెంటర్ మీదుగా భగత్‌సింగ్ విగ్రహం వద్దకు చేరింది. నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంఆ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, మాజీ ఎంఎల్‌ఏ గుమ్మడి నరసయ్య, చంద్ర అరుణ మాట్లాడుతూ భగత్‌సింగ్ వలస ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడిన స్ఫూర్తితో ప్రపంచ వ్యాప్తంగా స్వేచ్ఛ, సార్వభౌమత్వం కోసం పోరాడుతున్న పాలస్తీనా, క్యూబా, ఇరాన్ ప్రజలకు భారత ప్రజలు సంఘీభావంగా నిలవాలని పిలుపునిచ్చారు. రష్యా చమురు కొనుగోళ్లపై ఆంక్షలకు లొంగడం వల్ల దేశంలో చమురు వ్యయం, ప్రజలపై భారం పెరుగుతుందని పేర్కొన్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే భగత్‌సింగ్ సందేశమని, యువత ప్రజా ఉద్యమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈకార్క్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, పీడీఎస్‌యూ రాష్ట్ర, జిల్లా మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవాస్తవ ప్రచారాన్ని ఖండిస్తున్నాం..

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై ఇటీవల కొన్ని ప్రచార, ప్రసార, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న నిరాధార, వాస్తవాలకు విరుద్ధమైన కథనాలన కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వాసిరెడ్డి సాంబశివరావు తెలిపారు. పొదెం వీరయ్య సుమారు నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నాయకుడని, పార్టీ సిద్ధాంతాలు, గాంధీ కుటుంబ రాజకీయ భావజాలానికి కట్టుబడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఆరు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన ములుగు నియోజకవర్గం నుంచి రెండుసార్లు, భద్రాచలం నియోజకవర్గం నుంచి 2018లో ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవలందించారని తెలిపారు. 20182023 మధ్య పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో జిల్లాలోని కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలిచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకుడు పొదెం వీరయ్య అని అన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానం, పార్టీ పట్ల నిబద్ధతను పరిగణనలోకి తీసుకోకుండా ఊహాగానాలు, నిర్ధారణ లేని అంశాల ఆధారంగా కథనాలు ప్రచురించడం సరైన జర్నలిజం పద్ధతి కాదని సాంబశివరావు పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా వ్యక్తుల ప్రతిష్టక భంగం కలిగించేలా వార్తలు ప్రచురించకండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. నిరాధార ప్రచారాలను నమ్మకుండా ప్రజలు వాస్తవాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

## గండ్లు పూడ్చి..రోడ్డు సౌకర్యం కల్పించాలి

**బుద్దారం-రాయగూడెం మధ్య నిలిచిన రాకపోకలు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని వరదకు రోడ్డుకు గండి పడింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. దెబ్బతిన్న రహదారులను కాంగ్రెస్ నాయకులు ఇరగదిండ్ల నాగరాజు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బుద్దారంరాయగూడెం గ్రామాల మధ్య రహదారి వరదకు కొట్టుకపోయిందన్నారు. దీని వలన కట్టుకాచారం, రాయగూడెం, కొంగర, అప్పల నరసింహాపురం గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు నిలిచిపోయాన్నారు. బుద్దారం, రాజారాంపేట గ్రామాలకు చెందిన వారు జగ్గయ్యపేట రవాణా కు ఆటంకం కలుగుతుందన్నారు. అదే విధంగా వంతెన నిర్మాణం పూర్తైయినప్పటికీ అసౌకర్యంగా ఉండటం వలన వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారని ఆరోపించారు. బుద్దారం వాగు గండి పడ్డ ప్రదేశంకు మరమ్మతులు చేపట్టి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

## అప్పాయిగూడెంలో అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/కారేపల్లి:** అప్పాయిగూడెం గ్రామ పంచాయితీలో వీబీజీ రామ్ జీ పనులు, జీపీ మ్యాప్, రిసోర్స్ మ్యాప్ రూపకల్పనపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ వనరులు, సమస్యలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ నష్టాలను వివరించి, పునర్వినియోగ వస్తువులను వినియోగించాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్, కార్యదర్శి కృష్ణవేణి, ఉప సర్పంచ్ ఎట్టి సంధ్యారాణి, బీఎఫ్‌టీ వసంత్, ఎఫ్ఏ సాయమ్మ, మేట్ అజ్మీరా సురేష్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రేబిస్ నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

**-కలెక్టర్ దివాకర టిఏస్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రేబిస్ వ్యాధి నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ దివాకర టిఏస్, అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి రేబిస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేబిస్ వైరస్ వల్ల వచ్చే ప్రాణాంతక వ్యాధి అని ప్రధానంగా వైరస్ సోకిన జంతువుల కాటు ద్వారా మనుషులకు వ్యాప్తి చెందుతుందన్నారు. సరైన సమయంలో చికిత్స అందకపోతే రేబిస్ మరణానికి దారి తీసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రేబిస్ టీకాలు వేయించాలన్నారు. కుక్క కాటుకు గురైన వెంటనే గాయాన్ని సబ్బు, నీటితో శుభ్రంగా కడగాలని అనంతరం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. రేబిస్ నివారణకు వ్యాక్సినేషనే అత్యంత ముఖ్యమైన మార్గమన్నారు. జ్వరం, తలనొప్పి, నీటిని చూసినా, తాగేందుకు ప్రయత్నించినప్పుడు భయం (హైడ్రో ఫోబియా), గాలికి భయం (ఏరో ఫోబియా), అసహజ ప్రవర్తన వంటి లక్షణాలు రేబిస్‌లో కనిపించే అవకాశం ఉందన్నారు. సెప్టెంబర్ 22 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న రేబిస్ అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు రేబిస్ వ్యాధి నివారణ చర్యలు, వ్యాక్సినేషన్ పై అవగాహన కల్పించాలని సూచించారు.

**నషా ముక్త్ భారత్‌పై ప్రతిజ్ఞ :**
జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్‌తో పాటు అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, అధికారులు నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండటంతో పాటు వాటి దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

**అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ :**
జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ ఒకటి వరకు సీనియర్ సిటిజన్స్ వెల్ బీయింగ్ అండ్ ఎంపవర్‌మెంట్ వీక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ ఒకటిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వృద్ధుల సంక్షేమం, సాధికారతకు సంబంధించిన సహాయం కోసం ఎల్డర్ లైన్ 14567ను సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టాస్ ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**-జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు**
**-జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో అక్టోబర్ 11 నుంచి 17 వరకు నిర్వహించనున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ దివాకర టిఏస్, అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సంబంధిత అధికారులతో పరీక్ష నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టాస్ పదవ తరగతి, ఇంటర్ పరీక్షల కోసం రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్ఎస్‌సి పరీక్షలకు గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్, ఇంటర్మీడియట్ పరీక్షలకు జిహెచ్ఎస్ రిక్కాబజార్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 537 మంది ఎస్ఎస్‌సి, 411 మంది ఇంటర్ పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్షా కేంద్రం పరిసరాలలో జిరాక్స్ దుకాణాలను పరీక్షా సమయంలో మూసి వేయాలని, పరీక్షలు జరిగే సమయంలో 163బిఎన్ఎస్ యాక్ట్ అమలు చేయాలన్నారు. పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రశ్నా పత్రాలు ఇతర సామగ్రిని సురక్షితంగా పరీక్షా కేంద్రాలకు తరలించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎఎన్ఎంతో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. జవాబు పత్రాలను స్పీడ్ పోస్టు ద్వారా నిబంధనల మేరకు తరలించాలన్నారు.

# కార్మిక నేత నున్నా మాధవరావు మృతి

**-తుమ్మల, సిపిఐ సహా పలువురు నేతల నివాళి**





**ప్రజాపక్షం/ఖమ్మం :** కార్మిక సంఘం నాయకులు నున్నా మాధవరావు (83) గుండెపోటుతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మాధవరావు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఎడ్లబండ సంఘం నాయకునిగా మొదలై అనేక కార్మిక సంఘాలకు నాయకునిగా వ్యవహరించారు. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ మినీ ట్రాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. నిబద్ధత కలిగిన నాయకునిగా, కార్మిక పక్షపాతిగా మాధవరావు పేరొందారు. ఆయన మృతిపట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఐ నాయకులు నున్నా మాధవరావు మృతదేహం పై పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ నున్నా మాధవరావు మృతి పట్ల సంతాపాన్ని తెలియజేసింది. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, సోమా నర్సింహారావు, ఉపాధ్యక్షులు బత్తిని నర్సింహారావు, కోశాధ్యక్షులు తల్లాడ రమేష్, కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

# టింబర్ డిపోలను నగర బయటకు తరలించాలి

**-అఖిలపక్షం ఆధ్వర్యంలో అటవీశాఖాధికారికి వినతి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం శ్రీనివాస్ నగర్‌లో జనవాసాల మధ్య ఉన్న టింబర్ డిపోలను నగరం బయటకు తరలించాలని సోమవారం త్రీటౌన్‌లోని అఖిలపక్షం ఆధ్వర్యంలో అటవీ శాఖ జిల్లా అధికారి అనూజ్ అగర్వాల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో 30వేల మంది ప్రజలు నివసిస్తున్నారని, వేలాది మంది విద్యార్థులు ఈ ప్రాంతం గుండా పాఠశాలకు వెళ్తున్నారన్నారు. ప్రసిద్ధ అయ్యప్పస్వామి దేవాలయం సైతం ఈ ప్రాంతంలోనే ఉందని, నిత్యం వందలాది మంది గుడికి వస్తుంటారన్నారు. ఇక్కడ ఉన్న టింబర్ డిపోలలో కలప నిల్వలు, రంపం కోతలు వంటి కార్యకలాపాల వల్ల ఈ ప్రాంతంలో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనారోగ్య సమస్యలతో పాటు పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి టింబర్ డిపోలను నగరం బయటకు తరలించాలన్నారు.ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు యర్రా శ్రీనివాసరావు, మేకల శ్రీనివాసరావు, భూక్యా రవీందర్, భూక్యా శ్రీనివాసరావు, బండారు రమేష్, సైదులు, దొడ్డా నగేష్, పాలడుగు పాపారావు, నీలం కృష్ణ, వెంకట్రావు, శోభ, ఇమామ్, ఖాసీం, రంగారావు, శంకర్ పాల్గొన్నారు.

# భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలి

**-ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌కు నివాళి**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:** భారత విప్లవ యువ కిషోరం భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్ కోరారు. భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత పోరాడాలని పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 119వ జయంతి సందర్భంగా రఘునాథపాలెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా చింతల రమేష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత పోరాడాలన్నారు. భగత్‌సింగ్ కలలు కన్న దోపిడీ రహిత, సమానత్వ సమాజ నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలన్నారు. మత విద్వేషాలు, విభజన రాజకీయాలు దేశ ఐక్యతకు ప్రమాదకరమని తెలిపారు. నేటి యువత భగత్‌సింగ్ చూపిన మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు గుండ్ల అశోక్, నాయకులు ఆర్. బాలకృష్ణ, షేక్ మహ్మద్, కె. కళ్యాణ్, ఎం. భగత్‌సింగ్, ఎం. కృష్ణ, జగన్, మోహిత్‌కుమార్, మజీద్ అలీఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ ఆశయాలతో ముందుకు సాగుదాం



**ప్రజాపక్షం/మధిర:** భగత్‌సింగ్ దేశం కోసం మహోన్నతమైన ప్రగతిశీల ప్రయోజనాల కోసం తమ నిండు ప్రాణాలు అర్పించి భారత ఉపఖండాన్ని ప్రభావితం చేశాడని ఏఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శి గుగులోత్ హుస్సేన్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సంపసాల సాయి తెలిపారు. స్థానిక మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 119వ జయంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పలూమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్షలాది మంది భారతీయులను విప్లవ పంథావైపు నడిపించి ఇంక్విలాబ్ జిందాబాద్ అనే పోరాట నినాదాన్ని భారతీయ ప్రజల తో నినదించారని వారు అన్నారు. తెలుగు నాట యువకులు భగత్‌సింగ్, అల్లూరి సీతా రామరాజు, కొమరం భీముల చరిత్రలు తెలుసుకుంటే వారిలాగే మారిపోతారనే భయంతో మన పాలకులు, యువకుల మెదళ్లకు బూజులు పట్టిస్తున్నారని తెలిపారు. శాస్త్రీయ దృక్పథాన్ని విస్మ తపరిచి ఆరోగ్యవంతమైన మంచి సమాజాన్ని పెంపొందించాలని అందులో నుండే ప్రశ్నించే చైతన్యం ఏర్పడి అసమర్థ ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిపై విద్యార్థి యువకులు వెల్లువలు సృష్టించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మధిర మండల నాయకులు పాల్గొన్నారు.

# క్రీడా పోటీల్లో భరత్ స్కూల్ విద్యార్థుల హవా



**ప్రజాపక్షం/మధిర:** ఎస్‌జిఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీల్లో భరత్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్స్ పురుషుల కబడ్డీ విభాగంలో ద్వితీయ స్థానం, జూనియర్ గర్ల్స్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా భరత్ కిడ్స్ స్కూల్ విద్యార్థులందరికి భరత్ స్కూల్ కరస్పాండెంట్ శీలం వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, టి.ఉమ, ఐబిటి డీన్ కటికల రవీందర్‌రెడ్డి, ఇంచార్జ్ ప్రియాంక, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

# సిఈసిని తొలగించాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/మధిర:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, భారత ఎన్నికల సంఘం ఏకగ్రీవంగా వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారతదేశంలో రూ.13కోట్ల మంది ఓటు హక్కును తొలగించిన ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్‌కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనను అరెస్ట్ చేసి ప్రాసిక్యూట్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కరాటే టోర్నమెంట్‌లో సుప్రజకు గోల్డ్‌మెడల్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన బొడ్డు సుప్రజ ముంబైలో జరిగిన కరాటే టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించింది. గొల్లపాలెం గ్రామానికి చెందిన 7వ వార్డు మెంబర్ బొడ్డు కృష్ణకుమారి రామకృష్ణ దంపతుల కుమార్తె సుప్రజ చిన్న వయస్సులోనే కరాటేలో ప్రతిభ చాటుతూ పతకం సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి ముంబైలో నిర్వహించిన కరాటే పోటీల్లో సుప్రజ ఉత్సాహంగా పాల్గొని తన ప్రతిభను ప్రదర్శించింది. పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. ఈ విజయంతో సుప్రజ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమార్తె క్రీడారంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. సుప్రజ విజయంపై సిరిపురం గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్థుల అభినందనలు తెలిపారు. క్రీడల్లో రాణిస్తున్న సుప్రజను ప్రోత్సహిస్తేభవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తుందని వారు పేర్కొన్నారు.

# ఆదర్శ కమ్యూనిస్టు వడ్డే నాగయ్య

**-మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు**



**ప్రజాపక్షం/ఖమ్మం :** తుదిశ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసి విప్లవ కమ్యూనిస్టు భావజాల వ్యాప్తికి శ్రమించిన వడ్డే నాగయ్య ఆదర్శ కమ్యూనిస్టు అని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఇటీవల మరణించిన మాస్‌లైన్ నాయకులు వడ్డే నాగయ్య సంస్మరణ సభ స్థానిక హరితా గార్డెన్స్‌లో శిరోమణి అధ్యక్షతన జరిగింది. వడ్డే నాగయ్య చిత్ర పటానికి వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్మరణ సభలో పోటు రంగారావు మాట్లాడుతూ వేపకుంట్ల గ్రామంలో నాగయ్య కుటుంబం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి కేంద్రంగా పనిచేసిందని ఎవరు ఏ సమస్యతో వెళ్లినా ఆ సమస్య పరిష్కారానికి నాగయ్య ముందు వరుసలో నిలిచేవారన్నారు. రఘునాథపాలెం, కొణిజర్ల మండలాల్లో పేదలు పోడు నరికి సాగు చేసుకునేందుకు నాగయ్య దన్నుగా నిలిచారన్నారు. నూతన గ్రామాల నిర్మాణంలో పొట్లపల్లి శ్రీశైలం, వల్లూరి వెంకయ్య లతో కలిసి నాగయ్య విశేష కృషి చేశారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడటమే ఆయనకు సరైన నివాళి అన్నారు. ఈ సభలో పుసులూరి నరేందర్, కవి తిరుమల్, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కె. రాంనారాయణ, మాస్‌లైన్ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, జి. రామయ్య, శివలింగం, మలీదు నాగేశ్వరరావు, ఝాన్సీ పాల్గొన్నారు.

# సేవా స్ఫూర్తితో మిట్టపల్లి కిరణ్ జన్మదిన వేడుకలు

**విద్యార్థులకు నోట్‌బుక్స్, డ్రాయింగ్ సామాగ్రి పంపిణీ**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఆర్యవైశ్యులు సేవా స్ఫూర్తితో ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకొని గుట్టబడి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు నోట్‌బుక్స్ డ్రాయింగ్ సామాగ్రి, కాపీ రైటింగ్స్ తదితర విద్యా సామాగ్రిని అందజేశారు. ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ప్రధాన కార్యదరి, పాఠశాల ఉపాధ్యాయులు పెనుగొండ ఉపేంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వనమా విశ్వేశ్వరరావు, పెరుమాళ్ల కృష్ణమూర్తి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని, దానిని సాధించే దిశగా కష్టపడి చదవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సదుపాయాలు, వసతులు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.శ్రీనివాసచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైరా పట్టణ అధ్యక్షులు దారా కృష్ణ, మిట్టపల్లి సత్యంబాబు, నాగేశ్వరావు, నర్సింహారావు, విజయ్, శివ నాగ భూషణం, యండ్రపూడి శంకర్, వజినేపల్లి చక్రవర్తి, రవి, రంగా సింహాద్రి, కొప్పురావూరి సత్యం, తెల్లాకుల సందీప్, ఉపాధ్యాయులు గరిదేపల్లి వాసు, కల్వ లక్ష్మి, షేక్ సల్మా సుల్తానా, మొగలాబి, వాణిశ్రీ, దీప, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని మిట్టపల్లి కిరణ్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ఎస్‌బిఐటి విద్యార్థులు ఎంపిక

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రముఖ అంతర్జాతీయ సంస్థ విప్రో అనుబంధ విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్‌కు ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన 42 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. సోమవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలకు ఛైర్మన్ గుండాల కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కేవలం సాఫ్ట్‌వేర్ రంగం వైపే కాకుండా కోర్ బ్రాంచ్‌లకు సంబంధించిన ఉద్యోగ అవకాశాల వైపు కూడా అన్వేషించాలన్నారు. ప్రోడక్షన్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ వాహనాల వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని విద్యార్థులు ఇట్టి అవకాశాలను సద్వినియోగపర్చుకోవాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి.ధాత్రి మాట్లాడుతూ చెన్నెయ్, బెంగళూరులో గల విప్రో సంస్థ ప్లాంట్లకు నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో ఈసిఈ, ఈఈఈ విభాగాలకు చెందిన 42 మంది విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ ఉద్యోగాలకు గాను ఎంపికైన విద్యార్థులకు రూ.2.5 లక్షల వార్షి కాదాయం, పిఎఫ్, ఇన్సూరెన్స్‌తో పాటు ఇతర అలవెన్సులు అందుతాయని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥



రాజ్‌కుమార్ మాట్లాడుతూ కోర్ బ్రాంచ్‌ల మనుగడ కష్టమైన ఈ రోజుల్లో తమ విద్యార్థులకు విప్రో వంటి అంతర్జాతీయ సంస్థలో ఉద్యోగాలు దక్కడం ఎంతో గర్వకారణమన్నారు. ఎంబడెడ్ సిస్టమ్స్, విఎల్‌ఎస్‌ఐ డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్ వంటి అంశాలపై తమ కళాశాలలో అందించిన నిరంతర శిక్షణా తరగతులు ఈ విజయానికి తోడ్పాడ్డయన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, టిపివో ఎన్. సవిత, జి. ప్రభాకర్ పాల్గొన్నారు.

# స్కావెంజర్ వేతనాలను బ్యాంక్ ఖాతాలో జమ చేయాలి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్, కం స్కావెంజర్లుగా పనిచేస్తున్న కార్మికులకు జీతాలను పాఠశాల కమిటీ ఛైర్మన్ లు ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండానేరుగా కార్మికుల బ్యాంక్ అకౌంట్లో జమ చేయాలని టియుసీఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎదులాపురం గోపాలరావు, స్కావెంజర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నిమ్మటూరి లక్ష్మయ్య లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాటలుడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచిన నేటి వారికి కార్మికుల వేతనాలను విడుదల చేయలేదని తక్షణమే వారి వేతనాలను అందజేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టర్ కార్యాలయ లో కలెక్టర్ కు వినతి పత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులకు అతి తక్కువ వేతనం చెల్లించడం మూలంగా వారి కుటుంబాలు అర్ధాకలి తో




జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విధంగా స్వీపర్ కం స్కావెంజర్లను అను స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి 12,000 వేతనం అందించాలని వారు కోరారు. భద్రతలేని జీవితాలు గడుపుతున్న కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, వారిని పూర్తి కాలం కార్మికులుగా గుర్తించి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందించి డిఇఓతో మాట్లాడి తక్షణమే పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల వేతనాలను విడుదల విడుదల చేసి కార్మికులకు అందజేయాలని ఆదేశించారు. వారం రోజుల్లో వేతనాలు అందజేస్తామని కార్మికులకు ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్కావెంజర్ యూనియన్ జరిగింది జిల్లా నాయకులు నూనావత్ లక్ష్మణ్, సోనీ, శేషమ్మ, కౌసల్య, సత్యవతి, వరలక్ష్మి, లక్ష్మి, కవిత, రాజేశ్వరి, దేవి, రతమ్మ, రాములమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ నాయకులు చింతల హనుమంతు మృతి

**-నివాళులర్పించిన దండి సురేష్**



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండల కేంద్రానికి చెందిన సీపీఐ గ్రామ మాజీ కార్యదర్శి చింతల హనుమంతు మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. హనుమంతు భౌతికకాయంపై అరుణపతాకం కప్పి నివాళులర్పించారు. ఈసందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ హనుమంతు నిబద్ధత, క్రమశిక్షణతో పార్టీ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. తాడిత, పీడిత ప్రజల కోసం కమ్యూనిస్టుల నిరంతరం పోరాడుతారని, హనుమంతు ఆశయాలను కొనసాగిస్తూ ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి లతాదేవి, రావి శివరామకృష్ణ, మండల నాయకులు పుచ్చకాయల శ్రీనివాస్, వడ్డే వెంకటయ్య, తాత వెంకటేశ్వర్లు, బొల్ల రామస్వామి, చేరికూరి నరసయ్య, మల్లేష్, సుధాకర్ పాల్గొన్నారు.

# తాటిపూడిలో రెండు ఇళ్లలో చోరీ

**రూ.5లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు...రూ.30వేల నగదు అపహరణ**



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా వైరా మండలం తాటిపూడి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఇళ్లలో ఎవరూ లేని సమయాన్ని అదునుగా చేసుకొని రాత్రి దొంగతలు చోరీకి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనలో సుమారు రూ.5లక్షలు విలువైన బంగారం, వెండి వస్తువులతో పాటు రూ.30వేల నగదు అపహరణకు గురైనట్లు సమచాఆరం. గ్రామానికి చెందిన పతని సునీత ఇంట్లో సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను దొంగలు అపహరించినట్లు బాధితులు తెలిపారు. అదే గ్రామంలోని మరో ఇంట్లో సుమారు 20 గ్రాముల బంగారం, రూ.30వేల నగదు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. చోరీ ఘటనపై సమాచారం అందుకున్న వైరా ఎస్సై పుష్పాల రామారావు సంఘటనా స్థలానికి చేరుకొని రెండు ఇళ్లను పరిశీలించారు. చోరీ జరిగిన తీరును పరిశీలిస్తూ వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వరుసగా రెండు ఇళ్లలో చోరీ జరగడంతో తాటిపూడి గ్రామంలో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

# వీధికుక్కల స్వైరవిహారం

**వివిధ గ్రామాల్లో కుక్కల దాడులు...ఇద్దరికి తీవ్ర గాయాలు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని పలు గ్రామాల్లో వీధికుక్కల బెడద రోజురోజుకు పెరుగుతుంది. తాజాగా పుణ్యపురం, సిరిపురం కెజి గ్రామాల్లో వీధికుక్కల దాడిలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయపడ్డారు. సిరిపురం కెజి గ్రామానికి చెందిన దుప్పటి సత్యం రోడ్డుపై వెళుతుండగా ఓ వీధికుక్క ఒక్కసారిగా వెనుక నుంచి వచ్చి ఆయన కాలును పట్టుకొని పీకడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇదితరహాలో పక్క గ్రామమైన పుణ్యపురానికి చెందిన ముత్తారపు నాగయ్య(45) పై కూడా వీధికుక్క దాడి చేసింది. స్థానికులు గమనించి కుక్కలను తరిమివేయడంతో నాగయ్య ప్రమాదం నుంచి బయటపడ్డారు. గ్రామాల్లో వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తూ స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దీంతో రాత్రివేళల్లోనే కాకుండా పగటి సమయంలోనూ ఒంటరిగా వీధుల్లోకి వచ్చేందుకు ప్రజలు భయపడుతున్న పరిస్థితి నెలకొంది. వీధికుక్కల బెడదను అరికట్టేందుకు సంబంధిత పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/వైరా:** కృషి విజ్ఞాన కేంద్రం వైరా ఆధ్వర్యంలో మంచుకొండ కోఆపరేటివ్ సొసైటీలో వివిధ పంటల్లో విత్తనోత్పత్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె వైరా సీనియర్ శాస్త్రవేత్త, ఇంచార్జి డాక్టర్ పావని మాట్లాడుతూ వివిధ పంటల్లో నాణ్యమైన విత్తనోత్పత్తి ప్రాధాన్యతను వివరించారు. విత్తనోత్పత్తి సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాణ్యమైన విత్తనాల ఎంపిక, పంటలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. మంచుకొండ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సుధాకర్‌రావు మాట్లాడుతూ సొసైటీ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సొసైటీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను కార్యదర్శి శ్రీనివాసరావు వివరించారు. విత్తనోత్పత్తి చేస్తున్న రైతు సత్యనారాయణరెడ్డి తన అనుభవాలను రైతులతో పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సుధాకర్‌రావు, సిఈఈవో శ్రీనివాసరావు, సర్పంచ్ రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా పిఆర్‌టియు సర్వసభ్య సమావేశం



**ప్రజాపక్షం/మధిర:** పిఆర్‌టియు మధిర మండలశాఖ సర్వసభ్య సమావేశం మండలశాఖ అధ్యక్షులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన మధిర రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఘనంగా జరిగింది. ముందుగా మండల ప్రధాన కార్యదర్శి పోలే సుధాకర్, ప్రధాన కార్యదర్శి సంఘ కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టగా చర్చ అనంతరం సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా హాజరైన జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్‌రావు, ఆర్.రంగారావు మాట్లాడుతూ పిఆర్సీ, పెండింగ్ డిఏలు, సిపిఎస్ రద్దుపై ఖమ్మం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల భారీ ఎత్తున ధర్నా నిర్వహించామన్నారు. ఈ సర్వసభ్య సమావేశంలో మాజీ పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మోత్కూరి మధు, యలమద్ది వెంకటేశ్వర్లు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి, రాష్ట్ర జిల్లా మండల కార్యవర్గ సభ్యులు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# దేశంలో సమస్యల తీరు మారింది..?



**-జన్ జీ ఆందోళనల నుంచి ప్రజా ఉద్యమం**
**-ఐక్యత, ఐక్యకార్యాచరణ దిశగా అడుగులు**
**-కమ్యూనిస్టు సిద్ధాంతమే బలమైనది**
**-నక్సలిజం అంతం కాలేదు**
**-మీట్ ద ప్రెస్‌లో ఐఎఫ్‌టియు జాతీయ నేత ప్రసాద్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారతదేశంలో సమస్యల తీరు మారిందని ఒకప్పుడు ఆకలి ప్రధాన సమస్యగా ఉండేదని ఇప్పుడు పలు రకాల సమస్యలు భారతీయ సమాజాన్ని ఇబ్బందికర పరిస్థితులకు నెట్టివేస్తున్నాయని ఐఎఫ్‌టియు జాతీయ నాయకులు పి. ప్రసాద్ తెలిపారు. దేశంలో ఫాసిస్టు పాలన సాగుతుందని దీని అంతం కోసం బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించబడాలని ప్రజలను సంసిద్ధులను చేయాలని ఆయన తెలిపారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్ లో మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. సభా అధ్యక్షులుగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం వ్యవహరించగా ముఖ్య అతిథిగా టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కె. రాంనారాయణ హాజరయ్యారు. భారతదేశంలో ప్రస్తుతం నెలకొన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులను వివరించడంతో పాటు జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు ప్రసాద్ సమాధానం ఇచ్చారు. ఉత్పత్తి కారకులైనటువంటి రైతులు, కార్మికులు ఆందోళన బాటపట్టారని రైతులు ఒక చారిత్రాత్మక ఉద్యమం చేశారని ఇప్పుడు ప్రజా స్వామిక శక్తులు సైతం సమీప భవిష్యత్తులో ఆందోళనకు సిద్ధం కావాలన్నారు. గత కొంత కాలంగా నేటి తరం తరగతి గదులకో, కార్యాలయాకో పరిమితం అవుతుందని ప్రచారం జరిగిందని సామాజిక స్పృహ లేని తరంగా ముద్ర పడుతున్న సమయంలో జన్ జీ ఉద్యమం ఇవాళ ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుందన్నారు. ఇది వర్తమాన రాజకీయాలలో గొప్ప మలుపు అని కేవలం నీట్ ప్రశ్నాపత్రం లీక్ ద్వారానే జన్‌జీ ఉద్యమం రాలేదని దీనికి ఒక సామాజిక కోణం కూడా ఉందని ప్రసాద్ తెలిపారు. పెరిగిన నిరుద్యోగం, గాడి తప్పిన ఆర్థిక పరిస్థితులు, కార్పోరేటీకరణ జన్ జీపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. జన్ జీ ఉద్యమాన్ని స్వాగతిస్తున్నామని వామపక్షాలు సమన్వయం చేసుకుని ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఇది ఒక కీలక మలుపు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల కమిషనర్ విషయంలోనూ 48 గంటల తర్వాత ఆందోళనకు పూనుకుంటామని జన్ జీ ప్రకటించిందని ఇది ఆందోళన నుంచి ప్రజా ఉద్యమంగా మారాలని ప్రసాద్ ఆకాంక్షించారు. వామపక్ష సిద్ధాంతం బలమైనదని దానికి మరో ప్రత్యామ్నాయం లేదన్నారు. బతుకు నేర్పిన ఉద్యమం వామపక్ష ఉద్యమం అని ఆయన తెలిపారు. ఉద్యమ చీలికలపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ ఏ చీలిక అయినా ఉద్యమాన్ని బలహీన పరుస్తుందని సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ భావస్వరూప కలిగిన పార్టీలను ఐక్యం చేసే పనిలో ఉందని ఇది సాధ్యం కాని పక్షంలో ఐక్య కార్యాచరణ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. భారతదేశంలో ఉత్పత్తి పెరిగి వినియోగం తగ్గుతుందని ఇది అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు.అమెరికా లాంటి దేశాలు తమ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలని దేశంపై ఒత్తిడి తేస్తున్నాయని రానున్న కాలంలో ఈ దిగుమతులు వ్యవసాయ రంగంతో పాటు అన్ని రంగాల పైన తీవ్ర ప్రభావం చూపనున్నాయన్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ రంగంలో కార్పొరేట్లు ప్రవేశించిన ఇంకా కార్పొరేటీకరణ జరగలేదని భవిష్యత్తులో ఈ ప్రమాదం పొంచి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ఆర్థిక, ఎదుగుదల సుద్ద అబద్ధమని ఇది కేవలం అంకెల గారడీ తప్ప మరొకటి కాదన్నారు. సంపద కలిగిన వారు మరింత సంపన్నులు అవుతుంటే పేదలు మరింత పేదలు అవుతున్నారని దీని సరాసరి లెక్కలే ఇప్పుడు ఆర్థిక ఎదుగుదలగా ప్రసాద్ అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్నట్లుగా మావోయిస్టు పార్టీ అంతం కాలేదని దానికి భవిష్యత్తు ఉందన్నారు. ప్రజలను భౌతికంగా పోరాటాలకు సిద్ధం చేయకుండా చేపట్టే ఏ పోరాటం విజయం సాధించదన్నారు. పాలకులు అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంసిద్ధులను చేసేందుకు వామపక్షాలు కృషి చేస్తున్నాయని ఆయన తెలిపారు. గతంలో పెట్టుబడిదారుల మధ్య పోటీ లేదని టాటా బిర్లా లాంటి వారు వస్తు ఉత్పత్తిలో ఉంటే అంబానీ, అదానీ లాంటి వారు అఉత్పాదక రంగాలలో ఉండి ప్రజా ధనాన్ని లూటీ చేస్తున్నారన్నారు. పెట్టుబడిదారి వర్గాల మధ్య పోటీ నెలకొందని ఆయన తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం నుంచి ఉన్న ఆలోచనలకు గత కొన్ని నెలలుగా దేశ యువతలో వచ్చిన ఆలోచనలకు మధ్య స్పష్టమైన తేడా ఉందని ఉదాసీన వైఖరి నుంచి ప్రశ్నించే తత్వం వైపు యువత అడుగులు వేస్తుందని దీనిని అన్ని పార్టీలు, సామాజిక శక్తులు స్వాగతించాలన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి



**ముున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం**

**ప్రజాపక్షం/మధిర:** విద్యార్థులు చిన్ననాటి నుంచే చదువుతో పాటు ఏదో ఒక క్రీడను ఎంచుకొని సాధన చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం పేర్కొన్నారు. మధిర టివిఎం పాఠశాలలో సోమవారం గర్ల్స్ క్రీడా పోటీల ముగింపు సందర్భంగాఏ ర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో చదువుతో పాటు శారీరక, మానసిక, ఉల్లాసానికి కెరీర్ ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థుల్లోని ప్రత్యేక ప్రతిభను సకాలంలో గుర్తించి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని కొనియాడారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం తోడైతే విద్యార్థులు ఏ రంగంలోనైనా అద్భుతాలు సృష్టించగలరని అన్నారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు ఉదాహరణకు ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. పివి సింధు క్రీడల్లో రాణించి దేశంలోని మహిళలందరికీ గర్వకారణంగా నిలిచారని, అదే స్ఫూర్తితో అక్కడున్న విద్యార్థినిలు కూడా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం వివిధ విభాగాల్లో క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినిలకు ఆమె బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నకిరికంటి రాజేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రేస్ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, అంజనబాబు, ప్రవీణ్ రెడ్డి, పిఈటి చిన్ని, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసలు కొనుగోలు ప్రారంభించాలి



**ప్రజాపక్షం/వైరా:** మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసలు కొనుగోలు కేంద్రా న్ని ప్రారంభించి రైతుల నుంచి కనీస మద్దతు ధరకు పెసలను కొనుగోలు చేయాలని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సిపిఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వైరా ఎంపిడివో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూక్యా వీరభ్రం మాట్లాడుతూ పెసల సాగు చేసిన రైతులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. దీంతో దళారులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని తక్కువ ధరలకు పెసలను కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. 202627 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు పెసలు కనీస మద్దతు ధర క్వింటాళ్లకు రూ.8780గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, అయితే కేవలం కనీస మద్దతు ధర ప్రకటించడం వలన మాత్రమే రైతులకు ప్రయోజనం ఉండదని, స్థానికంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి పంటను కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, నాయకులు హరి వెంకటేశ్వరరావు, పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల మోహన్‌రావు, కొంగర సుధాకర్, అమరనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** భగత్‌సింగ్ స్ఫూర్తితో భవిష్యత్తులో పోరాటాలను నిర్వహించనున్నట్లు పివోడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి మాట్లాడుతూ విప్లవాత్మక సామాజిక మార్పు, స్వేచ్ఛ, సమానత్వం కోసం పరితపించిన భగత్‌సింగ్ ధన్యుడని ఆయన ఆశయ సాధనకు కృషి జరగాలని పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని పివైఎల్, పివోడబ్ల్యూ, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో రాంనర్సయ్య విజ్ఞాన కేంద్రం నుంచి సమీకృత మార్కెట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ రాష్ట్ర అధ్యక్షులు రాకేష్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మ ణ్, వివిధ ప్రజా సంఘాల నాయకులు భరత్, ఝాన్సీ, ధరణి కృష్ణ , మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, లక్ష్మ ణ్, శోభ పాల్గొన్నారు.

## మనో ధైర్యంతో ముందుకు సాగాలి : పువ్వాడ



**ప్రజాపక్షం/ఖమ్మం :** అనుకోని ప్రమాదాలు జరిగి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినప్పుడు మనో ధైర్యంతో ముందుకు సాగాలని మాజీ శాసన సభ్యులు, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు ఉద్బోధించారు. అనుకోని ప్రమాదాలు ప్రజల జీవన గతిని మార్చివేస్తాయని అటువంటి సమయంలో గుండె నిబ్బరంతో భవిష్యత్తుపై ఆశతో మార్గాలనే అన్వేషించాలన్నారు. రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన ఆటో కార్మికుడు మహేష్‌కు సోమవారం కృత్రిమ కాలును పువ్వాడ ఫౌండేషన్ తరుపున పువ్వాడ నాగేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పులతో కృత్రిమ కాళ్లు సైతం సరిగ్గానే పని చేస్తున్నాయని ఆయన అన్నారు. దివ్యాంగులకు చేయూతనందించేందుకు పువ్వాడ ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మమత ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ పువ్వాడ నరేన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రతాపనేని ఉపేందర్, ఆముదాల వెంకన్న, చార్లెస్, యూసఫ్, వీరబాబు, వెంకటరమణ, సత్యనారాయణ, అక్రమ్ పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత పోరాడాలి



**-ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భగత్‌సింగ్ స్ఫూర్తితో అవినీతి, అక్రమాలకు, అన్యాయాలకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా యువత పోరాడాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, చింతల రమేష్ తెలిపారు. భగత్‌సింగ్ 119వ జయంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అన్నం ఫౌండేషన్‌లో అనాథలకు పండ్లు పంపిణీ చేశారు. యూనివర్సిటీ పిజి కళాశాలలో భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీనాథ్‌రెడ్డి, రమేష్ లు మాట్లాడుతూ తెల్లదొరలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ వీరోచిత పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల అతి చిన్న వయస్సులోనే ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ వీరుడని కొనియాడారు. అటువంటి గొప్ప వ్యక్తి చరిత్రను లేకుండా చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. బిజెపికి నిజమైన దేశభక్తి ఉంటే భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మామిడాల కిరణ్, జిల్లా యంగ్ ఉమెన్ నాయకులు బొప్పి ఉమా, సతీష్, సంపత్ పాల్గొన్నారు.

## సిపిఎంలో చేరిన రవీందర్‌రెడ్డి దంపతులు



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండల పరిధిలోని కుర్నవల్లిలో సిపిఎం పార్టీ సమస్యలపై నిరంతరం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై ఐలూరి రవీందర్‌రెడ్డి, నాగమణి దంపతులు సిపిఎంలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ పాలనా విధానాలు మారడం లేదన్నారు. ప్రజలను మభ్యపెట్టి సంక్షేమ పథకాలపై ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తిరిగి ప్రజలను విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. 80 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో కూడా పేదలు పేదలుగానే మిగిలిపోతున్నారని, ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పకీరయ్య, రామిరెడ్డి, దర్గయ్య, సత్యనారాయణరెడ్డి, సత్యం, రజిని, కృష్ణమ్మ, లింగారెడ్డి, కోటారెడ్డి, వెంకటశేషిరెడ్డి, మాధవరావు, వీరభద్రం, గోపి, హన్మంతు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## అన్నారుగూడెంలో కోతుల బెడద



**ప్రజాపక్షం/తల్లాడ :** అన్నారుగూడెం గ్రామంలో గత రెండున్నర దశాబ్దాలుగా కొనసాగుతున్న కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం తల్లాడ మండల ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. గ్రామపెద్ద బొమ్మగాని రామనాథం, బిజెపి నాయకులు ఆపతి వెంకట రామారావు, పొన్నం కృష్ణారావు ల ఆధ్వర్యంలో గ్రామస్తులు అధికారులను కలిసి కోతుల సమస్య తీవ్రతను వివరించారు. గత 25 ఏళ్లుగా గ్రామంలో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగి ప్రజల భద్రతకు ముప్పుగా మారిందని తెలిపారు. గుంపులుగా వీధుల్లో సంచరిస్తూ ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయన్నారు. ఇండ్లలోకి జొరబడి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని తెలిపారు. మరో వైపు వ్యవసాయ పొలాల్లోకి వరి, పత్తి తదితర పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి కోతులను నియంత్రించేందుకు తక్షణ చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలు, రైతుల పంటలకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, నాగేశ్వరరావు, శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.